సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 12 । జూన్ । 2025



నన్నే కారు తీయమంటావా..

అడ్డంగా పెట్టిన కారు పక్కకు తీయాలని అడిగిన సెక్యూరిటీ గార్డుపై నన్నే కారు తీయమంటావా అంటూ ఓ టీడీపీ నాయకుడు దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. -8లో



రాజంపేట కాపులో 'ఇన్‌చార్జి' చిచ్చు!

రాజంపేట కాపు (బలిజసామాజికవర్గం)లో టీడీపీ ఇన్‌చార్జి పదవి చిచ్చు రేపుతోంది. కుల రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1680 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రైతాంగం అభివృద్ధికి కృషి



పనుల ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

రాయచోటి: జిల్లాలో ఎనలేని అభివృద్ధి జరిగిందని రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌తో కలిసి జిల్లా వ్యాప్తంగా పూర్తయిన పనుల ప్రారంభోత్సవం, నూతన పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతాంగం అభివృద్ధికి కృషి చేయన్నట్లు చెప్పారు. రాయచోటి ప్రాంతంలో ఎక్కువ మంది మామిడిసాగుపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరందరికీ గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు, ఆర్అండ్‌బి ఎస్ఈ వాసుదేవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనిక సంఘం అధ్యక్షుడిగా దాసరి రమణయ్య



కడప అర్బన్: ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా మాజీ సైనిక సంఘం నూతన అధ్యక్షుడిగా సుబేదార్ దాసరి రమణయ్యను ఎన్నుకున్నారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ కడప జిల్లా మాజీ సైనికుల సంఘం (డీఈఎస్ఎంఏ) సమావేశం నిర్వహించారు. గతంలో మాజీ సైనిక సంఘం అధ్యక్షుడిగా ఉన్న పువ్వాడ లక్ష్మీనారాయణ ఈ ఏడాది మార్చి 19న మరణించారు. ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మాజీ కెప్టెన్ ఎస్.ఎస్. రాముడు, మాజీ వారెంట్ ఆఫీసర్ బి.వి.రంగయ్య, ప్రధాన కార్యదర్శి బి.వి. గోపాల్‌రెడ్డి, ఇతర మాజీ సైనికులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



ద్విచక్రవాహనదారులకు సూచనలు ఇస్తున్న మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు

రాయచోటి: వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలని జిల్లా మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) కోరారు. బుధవారం రాయచోటిలో జిల్లా రవాణా అధికారి డి అశోక్ ప్రతాప్ సూచనల మేరకు చిత్తూరు రోడ్డు జంక్షన్‌లో ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్ చేసినందుకు విధించాల్సిన జరిమానాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రోడ్డు సిగ్నల్స్, భద్రత జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను ద్విచక్ర వాహనదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు బి సుబ్బారాయుడు, జెఆనీల్ కుమార్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటుధర కల్పించాలని ధర్నా



రాజంపేట మార్కెట్‌యార్డులో నిరసన వ్యక్తం చేస్తున్న మామిడిరైతులు

రాజంపేట: మామిడిరైతులకు గిట్టుబాటుధర కల్పించాలని బుధవారం రాజంపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘంనేతలు పందికాళ్ల మణి, చిట్వేలి రవి మాట్లాడుతూ మామిడిరైతులను ఆదుకోవాలని, ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రైవేటు మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు దాదాపు 200 ఉన్నాయ న్నారు. వారు సిండికేట్‌గా ఏర్పడి గతంలో ఉన్న ధరల కన్నా సగానికి తగ్గించి వేశారన్నారు. వీటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చిత్తూరు కలెక్టర్ తోతాపూరి కేజీ రూ. 12గా ధర నిర్ణయించారన్నారు. ఆ ధర అమలు కావడంలేదన్నారు. ఈ ఏడాది మామిడికాపు తక్కువగా ఉందని, ధర పెరగాల్సి ఉందన్నారు. దళారులు, జూస్ ఫ్యాక్టరీ యజమానులు ధర పెట్టడంలేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు హరిప్రసాద్, బొజ్జ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువులు సాగేదెలా..!

- నేటి నుంచి పాఠశాలల పునః ప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు..
- అసంపూర్తిగా తరగతి, టాయిలెట్స్ నిర్మాణాలు..
- యూనిఫామ్, బూట్లు, సాక్సులు పెండింగ్
- బ్యాగుల కొరత..
- పని చేయని ఆర్వో ప్లాంట్లు



ప్రభుత్వ పాఠశాలలు: 2177
విద్యార్థులు : 133626
ప్రైవేట్ స్కూళ్లు: 554
విద్యార్థులు : 107400



రాయచోటి: ఏడాదిలోనే ఎంత తేడా కనిపిస్తోంది.. గత ఐదు సంవత్సరాల పాలనలో విద్యావ్యవస్థ ప్రగతి బాటలో నడవగా ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారిందంటూ విద్యార్థులు తల్లిదండ్రులు మదనపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక విప్లవంలా విద్యారంగాన్ని ముందుకు తీసుకెళ్లగా... కూటమి సర్కార్ కుప్ప కూల్చింది.. నాడు -నేడు అభివృద్ధి పనులు అటకెక్కాయి. సర్కారు చదువులు చట్టు బండలవుతున్నాయి. తల్లికి వందనమన్న ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో ఒక్క రూపాయి వేయలేదు. ఇంగ్లీష్ మీడియానికి మంగళం పాడారు.. డిజిటల్ క్లాస్ రూమ్కు బై బై అన్నారు.. సబ్జెక్టు టీచర్లపై వేటు వేశారు. గోరుముద్దను ఘోరంగా మార్చారు. ఆసాంతం విద్యా వ్యవస్థను నీరు గార్చారు. ఫలితంగా ఫలితాలు దారుణంగా పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు ప్రభుత్వ బడుల వైపు చూడకుండా ప్రైవేట్ పాఠశాలల బాట పడుతున్నారు.

- వైఎస్ జగన్ పాలనలో సమూల విద్యా సంస్కరణలు ఉద్యమంలా సాగాయి. నాణ్యమైన విద్యను పేద పిల్లల ముంగిటకు తెచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోటాపోటీ చేరికలతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విరాజిల్లాయి. ఖాళీలు లేక 'నో వేకెన్సీ'బోర్డులు పెట్టే వరకు వెళ్లాయి. కూటమి పాలనలో సంస్కరణలు నిలిచిపోయి సంక్షేమ పథకాలు అమలు కాక నాటి పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. జిల్లాలో 40 రోజుల విరామం తర్వాత గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి.
- ఏడాది కిందటి వరకు ఎంతో గొప్ప ఫలితాలతో ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి నేడు దిగజారిపోయింది. వైఎస్సార్‌సీపీ పాలనలో మనబడి నాడు-నేడు పనులతో సకల సదుపాయాలతో వెలుగందిన బడులు నేడు జీవం కోల్పోయాయి. రికార్డు వ్యవధిలో ఫలితాలు అంటూ ఘనంగా చెప్పుకున్న పదో తరగతి ఫలితాల్లోనే ఈ ప్రభుత్వం డొల్లతనం బయటపడింది. జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో తప్పులు దొర్లడంతో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికే చెల్లింది.
- మోడల్ స్కూళ్ల పేరుతో ప్రాథమిక పాఠశాలలను దూరంగా ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడంతోనే ప్రభుత్వం పనితీరు తేటతెల్లమైంది. సర్కారీ బడుల్లో ప్రమాణాలను పెంచే పనులను పక్కన పెట్టడంతోనే చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటుకు మొజు చూపిందన్నది స్పష్టమైంది. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ చెలరేగి పోతున్నారు. ఒక్క స్కూల్ లో సగటున 10 నుంచి 30 శాతం పైగా ఫీజులు పెంచేశారు. 2024 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ ఏడాది అధిక శాతం ప్రైవేట్ విద్యార్థులు జిల్లా నుంచి ఆ స్థానంలో నిలిచారు. దీంతో 'షైనింగ్ స్టార్' అవార్డులు ప్రైవేట్ పాఠశాలల వారికే దక్కాయి.

పాడుబడిన భవనాలు

వైఎసాసర్‌సీపీ పాలనలో నాడు-నేడు కార్యక్రమంతో ఒక వెలుగు వెలిగిన పాఠశాలలు నేడు కళావిహీనంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో గదులు పాడుబడ్డాయి. పాఠశాల ఆవరణ చెత్తాచెదారంతో నిండిపోయింది. టాయిలెట్స్ వైపు వెళ్లలేని పరిస్థితులు. చాలా బడుల్లో ఏర్పాటు చేసిన బోరుబావులు, నీటి ట్యాంకులు పనికిరాకుండా పోయాయి. దాతలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంట్లు పనికి రాకుండా పోయాయి. 90 శాతం పైగా పనిచేయడం లేదని సమాచారం.

పూర్తికాని బదిలీలు.

జిల్లా పరిధిలో ఉపాధ్యాయుల బదిలీలు ఇంకా పూర్తి కాలేదు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు మాత్రమే నేటి వరకు పూర్తికాగా.. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరగలేదు. దీంతో అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థులు లేని చోట ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇలా ఉండడం వల్ల పాఠశాల ప్రారంభంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి.

- నేటినుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నా విద్యార్థులకు అందాల్సిన బుక్స్, యూనిఫామ్, బూట్లు, సాక్షులు, కిట్లు, బ్యాగుల కొరత ఉన్నట్లు సమాచారం.

» వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు శుద్ధజలం

మదనపల్లె సిటీ: నాడు-నేడు కింద గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు శుద్ధ జలం అందేది. ఆర్‌ఓ ప్లాంట్లు విద్యార్థులకు ఉపయోగపడ్డాయి. నాడు-నేడు మొదటి ఫేస్‌లో 600, రెండో ఫేస్‌లో 1016 పాఠశాల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో సుమారు 1000 వరకు ప్లాంట్లు మర్మమ్మతులకు గురికావడంతో పని చేయడం లేదు. కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేయని ఆర్‌ఓ ప్లాంటు

» ఫీజుల బాదుడు



ప్రభుత్వ విద్యా విధానాల వల్ల పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారడంతో విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు తీసుకెళ్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ఫీజులను భారీగా పెంచేశాయి. ఏడాది సగటున 10 నుంచి 30 శాతానికి పైగా స్కూల్ ఫీజులు పెంచేయడంతో పేద మధ్య తరగతి వర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంది.

- రాయచోటిలోని శ్రీ చైతన్య స్కూల్లో గత ఏడాది 5వ తరగతికి ఫీజు రూ.30వేలు, పుస్తకాలకు రూ. 7,500, అడ్మిషన్ నగదు రూ.2 వేలు(మొత్తం రూ.39,500) వసూలు చేశారు. ఈ ఏడాది స్కూల్ ఫీజును రూ.50 వేలు చేశారు. పుస్తకాలకు రూ.8,500 కట్టించుకున్నారు. రిజర్వ్ నగదు తో కలిపి రూ 60,500 వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఏ పాఠశాలకు వెళ్లినా కనిపిస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం

గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. ప్రారంభం రోజునే విద్యార్థులకు బుక్స్, బ్యాగులు, యూనిఫామ్ అందివ్వాలని ఆదేశించాం. కొన్ని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నా, అధికంగా ఉన్న వాటిని వెంటనే పరిశీలించి..అక్కడికి ఉపాధ్యాయులను పంపే చర్యలు చేపడతాం.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ప్రారంభం రోజు నుంచే పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించాం.

–సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖాధికారి

కమనీయం..కల్యాణం




మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకుడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని కోదండరామస్వామి ఆలయంలో జేష్ఠమాసం పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు విశ్వసేవపూజ, కంకణ పూజ, యజ్ఞోపవీతధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి: పోలీసు శాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. బుధవారం రాయచోటిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో రాయచోటి సబ్ డివిజన్ పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా మత్తుపదార్థాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై తరచూ దాడులు చేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారి కదలికలపై, చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై యువతను, ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి ఆచూకీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన ప్రొటోకాల్!



రాజంపేట రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్‌సభావేదికపై ప్రొటోకాల్ లేని కూటమినేతలను ఆసీనులు చేసిన రైల్వే అధికారులు



ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌కు పచ్చజెండా ఊపుతున్న నాయకులు

- రైల్వేఅధికారులను దారితప్పించిన పచ్చపెత్తనం
- ఢిల్లీ రైలుహాల్టింగ్ సభావేదికపై కూటమినేతలు

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్(అదనపుస్టాపేజ్) సభ నిర్వహణ విషయంలో పాటించాల్సిన ప్రొటోకాల్‌ను రైల్వేశాఖ పట్టాలు తప్పించిందనే ఆరోపణలు రైల్వే వర్గాల నుంచి వినిపించాయి. ప్లాట్‌ఫాంలో కడప వైపు ఏర్పాటు చేసిన వేదికపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖాన్‌ను పిలిచారు. తర్వాత ఆహ్వాన పత్రికలో పేర్కొన్న ప్రజాప్రతినిధులు పేర్లు కూడా కనీసం ఉచ్చరించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆహ్వానించిన వారు కొన్ని అనివార్యకారణాల వల్ల రాలేకపోయినప్పటికీ, ప్రొటోకాల్ రీతిలో అధికారులు ప్రస్ఫుటించలేకపోవడం విమర్శలకు దారితీసింది. విధిలేని పరిస్థితిలో రైల్వే అధికారులు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టేసి, బీజేపీ నేతలు సాయిలోకేశ్, రమేష్‌నాయుడు, టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్ రాజును వేదికను ఎక్కించేశారు. అక్కడి నుంచి వేదిక పూర్తిగా కూటమిపార్టీ సభగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. అందరి చేతికి పచ్చజెండాలు ఇచ్చేశారు. రైలును కదిలించారు. వేదిక సాక్షిగా సన్మానాలు, సత్కారాలు చేసేసుకున్నారనే విమర్శలు వచ్చాయి. రైల్వేఅధికారులు అందరికి మాట్లాడే అవకాశం ఇస్తే ప్రొటోకాల్ రగడ రాజుకుంటుందని, ఒక్క మంత్రికే మాట్లాడే అవకాశం కల్పించడం గమనార్హం.

ఢిల్లీ రైలు హాల్టింగ్‌కు పచ్చజెండా

ఢిల్లీకి వెళ్లే ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్(12707/12708) రైలుకు రాష్ట్ర రవాణాశాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈయనతోపాటు ఎమ్మెల్సీ జకియాఖాన్, గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్, డివిజన్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజంపేట నుంచి దేశ రాజధానికి ప్రత్యక్ష అనుసంధాన్ని అందించే మొదటిరైలు ఇదే అని అనన్నారు. రాజంపేట స్టేషన్ నుంచి తిరుపతి, కాచిగూడ, నాగ్‌పూర్, భోపాల్, ఢిల్లీ వంటి నగరాలకు సౌకర్యవంతమైన ప్రయాణం సులభతరం చేస్తుందన్నారు.గుంటూరు డీఆర్ఎం సుధేష్ణసేన్ మాట్లాడుతూ అమృత్‌భారత్ కింద రాజంపేట రైల్వేస్టేషన్‌ను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

ఎర్ర దొంగలకు మదనపల్లె రాచబాట?

- ఈ ప్రాంతం సేఫ్ జోన్‌గా స్మగర్ల కార్యకలాపాలు
- ఆగిపోయిన అటవీశాఖ నిఘా, దాడులు



మూతపడిన శంకరాపురం అటవీ చెక్‌పోస్టు

మదనపల్లె: ఎర్రచందనం అక్రమ తరలింపునకు మదనపల్లె అటవీ రేంజి సురక్షిత ప్రాంతంగా స్మగ్లర్లు ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలోని బెంగళూరు సమీపంలో ఉండటం, ఇక్కడ అటవీశాఖ తనిఖీలు, దాడులు పూర్తిగా లేకపోవడంతో ఇక్కడినుంచి తరలింపునకు అటంకం లేదని నిర్ధారించాక.. ఈ ప్రాంతం మీదుగా స్మగ్లింగ్ సాగుతున్న విషయం తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశాక కాని వెలుగులోకి రాలేదు. ఈనెల 9న తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె వద్ద 48 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ములకలచెరువు, పెద్దమండ్యం, గుర్రంకొండ మండలాలకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో ఎర్ర చందనం స్మగ్లింగ్ మదనపల్లె రేంజి పరిధిలో సాగుతోందన్న విషయం స్పష్టమైంది. గతంలో పట్టుబడిన ఎర్ర చందనం, నమోదైన కేసులను పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్టం అవుతుంది. అయితే కొంతకాలంగా మదనపల్లె అటవీశాఖ నుంచి దాడులు, నిఘా లేకపోవడంతో ఈ వ్యవహారం ఇంతకాలం వెలుగులోకి రాలేదు. దీంతో ప్రస్తుతం ఇది చర్చనీయాంశమైంది.

స్మగర్లు ఎంచుకున్న మార్గాలు?

జిల్లాలోని రాజంపేట లేదా ఇతర ప్రాంతాల నుంచి ఎర్ర చందనం దుంగలను కర్ణాటకలోని ప్రాంతాలకు తరలించేందుకు స్మగ్లర్లు మార్గాలుగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని గాలివీడు నుంచి పెద్దమండ్యం, సత్యసాయి జిల్లాలోని కదిరి మీదుగా.. మదనపల్లె రేంజిలోని ములకలచెరువు నుంచి బి.కొత్తకోట మీదుగా బెంగళూరు, చెన్నైలకు, పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె, దిగువపల్లె గ్రామాల మీదుగా, గాలివీడు మండలం గోరానిచెరువు నుంచి సరిహద్దు పాపేపల్లి పంచాయతీలోని గొర్లవానికుంట మీదుగా పెద్దమండ్యంలోకి, గుడిసివారిపల్లె మీదుగా పెద్దమండ్యం-తంబళ్లపల్లె మార్గం, గాలివీడు బస్టాండు నుండి దిగువపల్లె మీదుగా బండ్రేవు వద్ద పెద్దమండ్యం-తంబళ్లపల్లె మార్గం మీదుగా ములకలచెరువు, మదనపల్లె వైపు వెళ్తున్న మార్గం, వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల మీదుగా.. సత్యసాయి జిల్లా కదిరి నుంచి ములకలచెరువు మీదుగా బి.కొత్తకోట, శంకరాపురం నుంచి కర్ణాటకకు, అలాగే ములకలచెరువు నుంచి మద్దయ్యగారిపల్లె మీదుగా కందుకూరు, కర్ణాటకలోని చేలూరు నుంచి బెంగళూరుకు, కదిరి నుంచి ములకలచెరువు మీదుగా మదనపల్లె, అక్కడినుంచి చీకలబైలు నుంచి కర్ణాటకలోకి స్మగ్లింగ్ సాగించేందుకు ఎలాంటి ఆటకం లేకపోవడం, రద్దీ ఉండని కారణంగా ఈ మార్గాలు ఎంచుకున్నట్లు భావిస్తున్నారు. తొమ్మిదో తేదిన తంబళ్లపల్లె నుంచి ములకలచెరువు మార్గంలోని అన్నగారిపల్లె వద్ద దుంగలు పట్టుబడ్డాయి. అంటే ఈ మార్గంలో ములకలచెరువు చేరుకుని అక్కడి నుంచి వారి గమ్యస్థానానికి చేర్చే ప్రయత్నంగా తెలుస్తోంది. గుర్రంకొండ, పెద్దమండ్యం, మదనపల్లె మీదుగా చీకలబైలు మార్గం కూడా స్మగ్లింగ్‌కు సురక్షితంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రేంజిలో అధికంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే ఎర్ర చందనం కేసులు అధికంగా నమోదు కావడం విశేషం.

దాడుల ఊసేలేదు..

గతంలో అటవీశాఖ దాడులు చేసేది. ప్రస్తుతం దాడుల ఊసేలేదు. అన్నగారిపల్లెన వద్ద ఎర్ర చందనం దుంగలు, స్మగ్లర్లను పట్టుకునేందుకు తిరుపతి నుంచి టాస్క్‌ఫోర్స్ బృందం రావాల్సి వచ్చింది. దీన్నిబట్టి చూస్తే అటవీశాఖ దాడులు లేవని స్పష్టం చేస్తున్నాయి. మదనపల్లె రేంజి పరిధిలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలు ఉండగా ఒక సబ్ డీఎఫ్ఓ, ఒక రేంజర్, ఒక డీఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్లు, బీటు అధికారులు, సహాయ బీటు అధికారులు ఉన్నారు. వీరు నిఘా పెట్టి సమాచారం సేకరించి స్మగ్లింగ్‌పై దాడులు చేయవచ్చు. అయితే చాలా కాలంగా అటవీశాఖ అధికారులు కనీసం కలప అక్రమ తరలింపుపైనా కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు.

సా మిల్లులపైనా తనిఖీ లేదు

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని సామిల్లులపై అటవీశాఖ తనిఖీలు, పర్యవేక్షణ ఏమాత్రం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఒక చెట్టును నరకాలంటే రెవెన్యూ, అటవీశాఖ అనుమతులు కావాలి. అయితే సా మిల్లుల్లో నిల్వ ఉన్న వందల టన్నుల కలప ఎక్కడి నుంచి వచ్చింది, వాటికి అనుమతి ఎవరిచ్చారు, ఎవరు తరలించారు అన్న కనీసం సమాచారం సేకరించిన దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు భూముల్లోని కలప వృక్షాలను యథేచ్ఛగా నరికి తరలించుకుంటున్నారు. దీన్ని విచారించే వారు లేరు.

» చెక్‌పోస్టుల మూత

మదనపల్లె నియోజకవర్గం చీకలబైలు, తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలంలోని శంకరాపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను మూసివేశారు. ఇవి ఉన్నప్పుడు విధుల్లోని అటవీ సిబ్బంది తనిఖీలైనా చేసేవారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేదు. దీంతో ఈ మార్గాల్లో స్మగ్లింగ్ చేసుకునేందుకు అటంకం లేకుండాపోయింది.

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలిక కిడ్నాప్ విషయంలో షఫీ(25)పై పోక్సో కేసు నమోదైంది. రాయచోటి పట్టణం కొత్తపల్లెకు చెందిన జుబేరి(17)ను కిడ్నాప్ చేసి హత్యాయత్నం చేసినట్లు బాలిక తల్లి రాయచోటి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు నెల్లూరు జిల్లా మూలాపేటకు చెందిన షఫీ బాలికను తీసుకెళ్లినట్లు గుర్తించారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి షఫీపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ - ఇరువురికి గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నమండెం : మండల పరిధిలోని కడప-బెంగళూరు జాతీయ రహదారిపై కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. రాయచోటి వైపు నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న కారు.. అటుగా వస్తున్న బైక్ ఎదురెదురుగా బుధవారం ఢీకొన్నాయి. స్కూటర్‌లో వెళ్తున్న లావణ్య, నందకుమార్‌లకు గాయాలవగా, క్షతగాత్రులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యాపారి మృతి



సలావుద్దీన్(ఫైల్)

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కూరగాయల వ్యాపారి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె వన్నూర్‌సాహెబ్‌గుట్టకు చెందిన సలావుద్దీన్ (65) పట్టణంలో కూరగాయల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఫిబ్రవరి 22వ తేదీన రాత్రి వ్యాపారం ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా మల్లికార్జున సర్కిల్ వద్ద ఎదురుగా వచ్చి మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో సలావుద్దీన్ తీవ్రంగా గాయపడగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య ముంతాజ్, కుమారుడు అయాజుద్దీన్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజంపేట టీడీపీలో ఇన్‌చార్జి చిచ్చు!

- చమర్తికి వ్యతిరేకంగా ఏకమైన బలిజలు
- త్వరలో వేలాది మందితో బలిజల సభ
- బలిజలకు అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన
- రాజంపేటలో తారస్థాయికి కుల రాజకీయాలు



కలిసికట్టుగా ఉంటామంటున్న రాజంపేట బలిజ నేతలు

రాజంపేట : రాజంపేట కాపు (బలిజసామాజికవర్గం) లో టీడీపీ ఇన్‌చార్జి పదవి చిచ్చు రేపుతోంది. కుల రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయి. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో రాజంపేట పరిసర ప్రాంతాల బలిజలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేతలు ఈ సందర్భంగా వారి మనోగతాలను వెల్లడి చేసుకున్నారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి తమకు రాజంపేటలో జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలని నిర్ణయించారు. అంతకుముందే రెండు వేల మందితో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని, అంతా ఏకతాటిపైకి వచ్చేందుకు సన్నద్ధం చేస్తామని బలిజ నేతలు వెల్లడించారు.

నాన్ లోకల్ నేత వద్దు..

ఇన్‌చార్జి పదవి లోకల్ నేతకే ఇవ్వాలి..నాన్‌లోకల్ నేత తమకు వద్దంటూ అధిష్టానానికి తెలియచేస్తామని బలిజ నేతలు గళం విప్పారు. రాజంపేటలో టీడీపీకి ఆది నుంచి బలిజ సామాజికవర్గం అండగా ఉండి పనిచేసిందని వారు వెల్లడించారు. ఇప్పుడు బలిజలకు అన్యాయం జరుగుతోందని, బలిజల విషయంలో టీడీపీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోవడంలేదని పలువురు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలను రాజకీయాల కోసం బలి చేయకుండా, రాజకీయపరంగా ప్రాధాన్యం ఇవ్వాలని, స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్థానికేతరులకు ఇన్‌చార్జి పదవి ఇస్తే టీడీపీకి బలిజలు దూరమవుతారని సమావేశంలో వారు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

చమర్తికి వ్యతిరేకంగా ఏకమైన బలిజలు

టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు రాజంపేటపై పెత్తనం చేయడానికి బలిజ సామాజికవర్గ నేతలు జీర్ణించుకోలేకున్నారు. ఇదే విషయంపై బలిజ ఆత్మీయ సమావేశంలో ప్రస్ఫుటంగా కనిపించింది. బలిజలను రాజంపేటలో తొక్కేస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన బత్యాల చెంగల్రాయుడే మళ్లీ ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని బలిజలు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. ఈవిషయంలో బలిజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బలిజ నేతలు గునుకల చిన్న మోదుగల పెంచలయ్య, బండారుబాలయ్య, లేబాకనరసయ్య, నువ్వుల చిన్నయ్య, అనుమలగుండ మనోహర్‌తో పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బలిజ అభిమానులు పాటు రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట తదితర ప్రాంతాలకు చెందిన బలిజనేతలు పాల్గొన్నారు.

నన్నే కారు తీయమంటావా..



ధరణికుమార్‌ను పరామర్శిస్తున్న శానిటేషన్ సిబ్బంది



పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

సెక్యూరిటీ గార్డుపై టీడీపీ నాయకుడి దాడి

పీలేరు రూరల్ : అడ్డంగా పెట్టిన కారు పక్కకు తీయాలని అడిగిన సెక్యూరిటీ గార్డుపై నన్నే కారు తీయమంటావా అంటూ ఓ టీడీపీ నాయకుడు విరుచుకుపడిన సంఘటన బుధవారం జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. ఏరియా ఆస్పత్రిలో బుధవారం పట్టణానికి చెందిన తుమ్మల ధరణికుమార్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఆయన విధులు నిర్వర్తించే సమయంలో టీడీపీ నాయకుడు మహేష్ వచ్చారు. ఆస్పత్రి ఆవరణలో రోడ్డుపై అడ్డంగా కారు పార్క్ చేశాడు. కారు పక్కకు తీయాలని అక్కడే ఉన్న ధరణీకుమార్ కోరారు. దీంతో ఆవేశంగా నన్నే కారు తీయమంటావా.. అంటూ ధరణికుమార్‌పై మహేష్ దాడి చేశాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడతో దళిత సంఘాల నాయకులతో కలిసి స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు టిఎల్.వెంకటేష్, సుధాకర్ బాబు, సుభాష్, బోదేషా పాల్గొన్నారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

తుమ్మల ధరణికుమార్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో అడ్డుగా ఉన్న కారును పక్కకు తీయాలని చెప్పినా వినకుండా.. సెక్యూరిటీ గార్డుపై దాడి చేసిన మహేష్‌ను అరెస్ట్ చేయాలని కోరారు. ఆస్పత్రిలో పని చేస్తున్న ఏ స్థాయి ఉద్యోగిపైనైనా దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. అనంతరం పలువురు ఆస్పత్రి సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్, శానిటేషన్ వర్కర్స్ ధరణికుమార్‌ను పరామర్శించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, ఖదీర్, గణేష్‌రెడ్డి, అమ్మాజీ, నిరూపలక్ష్మీకుమారి, శిరీష, నాగరాణి, వరలక్ష్మీ, స్వామినాథం పాల్గొన్నారు.

ఆర్.బుడుగుంటపల్లె సర్పంచ్ మృతి

రాజంపేట టౌన్ : ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మేనమామ, ఆర్.బుడుగుంటపల్లె సర్పంచ్ ఓబుళం లక్ష్మీకర్‌రెడ్డి అలియాస్ చిన్నరెడ్డి (78) హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. అయిన చిన్నరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన స్వగ్రామం రేణింతలకు బుధవారం మృతదేహం చేరుకోగానే కడచూపు చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. చిన్నరెడ్డి 18 ఏళ్లపాటు సింగిల్‌విండో అధ్యక్షుడిగా, ఆర్‌బుడుగుంటపల్లె పంచాయితీ సర్పంచ్‌గా సేవలందించారు. పేదలకు ఉచిత వివాహాలు చేయించడం, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం చేశారు. ఆయన చేసిన సేవలకు మెచ్చి జనరల్‌కు కేటాయించినప్పుడంతా స్థానికులు చిన్నరెడ్డినే సర్పంచ్‌గా ఏకగ్రీవం చేశారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నరెడ్డికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్‌రెడ్డి, కాకతీయ విద్యా సంస్థల అధినేత పోలా వెంకటరమణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు చిన్నరెడ్డి మృతదేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

పట్టపగలే యువకుడి కిడ్నాప్

ఏడుగురిపై కేసు నమోదు



కిడ్నాప్‌కు గురైన తౌలిక్‌అల్లి (లాలు)

కలకడ : పట్టపగలే యువకుడిపై దాడిచేసి కిడ్నాప్ చేసిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం కలకడ టౌన్‌లో జరిగింది. ఎస్ఐ రామాంజనేయులు కథనం మేరకు.. కలకడ టౌన్ గుర్రంకొండ రోడ్డు సందువీధికి చెందిన పర్వీన్‌ను ఐదేళ్ల కిందట రాయచోటికి చెందిన ఖాజాకు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఖాజా భార్య పర్వీన్ అన్నదమ్ములకు రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇచ్చిన నగదు ఇవ్వాలని నాలుగు సంవత్సరాలుగా కోరుతున్నా తిరిగి చెల్లించడం లేదని ఖాజా మంగళవారం మధ్యాహ్నం మరో ఆరుగురు అనుచరులతో కలకడకు వచ్చి తౌలిక్ ఆలీని కిడ్నాప్ చేశారు. కట్టి కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. బుధవారం కిడ్నాప్‌కు గురైన తౌలిక్ అల్లి (లాలు) తల్లి షేక్ కౌషిక్ ఫిర్యాదు మేరకు ఖాజా, మరో ఆరుగురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

తహసీల్దార్లు, డీటీల బదిలీ

రాయచోటి : జిల్లా పరిధిలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉత్తర్వులను పత్రికలకు విడుదల చేశారు. ఒకటి, రెండు రోజుల్లో కేటాయించిన స్థానాల్లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

తహసీల్దారు	బదిలీ అయిన ప్రాంతం
డి.శ్రావణి	కలెక్టరేట్ సూపరింటెండెంట్
ఎం.దైవాధీనం	కలెక్టరేట్ సూపరిటెండెంట్
ఎం భీమేస్వరరావు	కలెక్టరేట్ సూపరిటెండెంట్
బి.శ్రీధర్‌రావు	రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం
కె.నిర్మలాదేవి	మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం
ఎన్ఎండీ.రోషణ హుస్సేన్	అన్నమయ్య కలెక్టరేట్ కార్యాలయం
ఎ.శ్రీనివాసులు	రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం (కేఆర్ఆర్‌సీ)
కె.అమర్నాథ్	రైల్వేకోడూరు
ఎస్.మహబూబ్‌చాంద్	సుండుపల్లి
వి.పుల్లారెడ్డి	పుల్లంపేట
ఎంవీ.సుబ్రహ్మణ్యంరెడ్డి	సంబేపల్లి
ఎస్.మహేశ్వరీబాయ్	కలకడ
కె.ఖాజాబీ	వీరబల్లి
సి.శ్రీనివాసులు	తంబళ్లపల్లి
కె.ధనుంజయులు	కురబలకోట
కె.కిషోర్‌కుమార్‌రెడ్డి	మదనపల్లి
జె.యామిని	ఓబులవారిపల్లి
పి.స్పందన	చిట్వేలి
జి.అమరేశ్వరీ	నందలూరు
తేజస్వి	పెద్దమండెం
ఎఫ్ఏసీలుగా...	
ఎన్.క్రాంతికుమార్	లక్కిరెడ్డిపల్లి ఇన్‌చార్జ్ ఎంఆర్‌ఓగా
బి.బావజాన్	బి.కొత్తపేట ఇన్‌చార్జ్ ఎంఆర్‌ఓగా
ఎస్.వెంకటేశ్వర్లు	రామాపురం ఎఫ్ఏసీ
ఎన్.రామాంజనేయులు	డీసీఎస్ఓ, అన్నమయ్య
జి.తపస్వినీ	నిమ్మనపల్లి ఎఫ్ఏసీ
డి.హరికుమార్	డీసీఎస్ఓ అన్నమయ్య
ఎం.శివకుమార్	పీలేరు ఎఫ్ఏసీ
డిప్యూటీ తహసీల్దారు	బదిలీ అయిన ప్రాంతం
పీర్‌మున్నీ	రాజంపేట తహశీల్దార్ కార్యాలయం
డి.అమరేశ్వర్	పెనగలూరు తహశీల్దార్ కార్యాలయం
పి.లక్ష్మీ ప్రసన్న	గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయం

ఎంపీ కృషితోనే సంపర్క్ క్రాంతి రైలుకు హాల్టింగ్



మాట్లాడుతున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెంభరత్‌రెడ్డి, తదితరులు

రాజంపేట : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభసభ్యుడు మేడా రఘునాథరెడ్డిల కృషి తోనే రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ కల్పించారని గుంతకల్ డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జెనుగు కృష్ణారావుయాదవ్, దండుగోపి తదితరులు పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రాజంపేట రైల్వే స్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి రైలు అదనపు స్టాపేజీకి ఒకటిన్నర దశాబ్దం పట్టిందన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజంపేట రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని ఎంపీలను కోరుతూ వచ్చారన్నారు. రాజంపేట ఆర్వోబీకి ప్రత్యామ్నాయంగా సబ్‌వేకు రైల్వే బడ్జెట్‌లో రూ.2 కోట్లు కేటాయించేలా ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేశారన్నారు. అమృత్‌భారత్ పథకం కిందకు తీసుకురావడంతో ఆ దిశగా రైల్వే శాఖ కోట్లాదిరూపాయిలు వెచ్చించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డె రమణ, రమేష్‌నాయుడు, సనిశెట్టి నవీన్, జావిద్‌అలీ, మసూద్ అలీఖాన్, సొంబెత్తిన శ్రీనివాసులు, మారుతి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు



మంగమ్మ

మదనపల్లె రూరల్ : అగ్నిప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో బుధవారం జరిగింది. అమ్మచెరువుమిట్ట ప్రాంతంలో నివశిస్తున్న వెంకటేశప్ప భార్య మంగమ్మ(65) ఇటీవల ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమతమైంది. బుధవారం గంగజాతర జరుగుతుండగా కూతురు వెంకటలక్ష్మి, మనుమడు అజయ్ బోనాలు సమర్పించడానికి వెళ్లారు. అదే సమయంలో ఇంట్లో వెలిగించిన దీపం కారణంగా మంటలు వ్యాపించి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. లేవలేని స్థితిలో ఉన్న మంగమ్మకు తీవ్ర గాయాలవడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. కురబలకోట మండలం చింతయ్యగారికోటకు చెందిన సి.రెడ్డప్ప(45) తన మేనకోడలు సింధు(14)తో కలిసి పొలం వద్ద ఉన్న అల్లనేరేడు పండ్లు కోసుకుని, విక్రయించేందుకు ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా గొల్లపల్లి బైపాస్‌రోడ్డులోని చౌడేశ్వరి గుడి వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో రెడ్డప్ప తీవ్రంగా గాయపడగా సింధు సైతం గాయపడింది. రెడ్డప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేతపై మంత్రి ఆగ్రహం



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న బిజేపీ నేత వెంకట్రామరాజు (కాషాయ కండువా కప్పుకున్న వ్యక్తి)

రాజంపేట : బీజేపీ కిసాన్ మోర్చ మాజీ నేత వెంకట్రామరాజుపై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాజంపేట రైల్వే స్టేషన్‌లో ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్ స్టాపింగ్ కార్యక్రమానికి మంత్రి విచ్చేశారు. రైల్వే అతిథి గృహంలో బస చేసిన సందర్భంలో బీజేపీ నేత వెంకట్రామరాజు కలిశారు. సుండుపల్లి మండలంలో భూ కబ్జాకు సంబంధించి ఫిర్యాదు పత్రాన్ని ఇవ్వడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో భూకబ్జాదారుడు తమ(మండిపల్లి) పేరు చెప్పుకొని పనులు చేస్తున్నాడని ఆరోపించారు. దీంతో మంత్రి తీవ్రంగా స్పందించి ఏమి మాట్లాడుతున్నావ్.. కండువా లేసిపోతుంది.. బయటకి వెళ్లిపో అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరిముందు మంత్రి నిలదీసేసరికి కాషాయ వర్గాల్లో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. కూటమిలో భాగస్వామ్య బిజేపీ నేత సమస్య చెప్పుకోవడానికి వస్తే మంత్రి ఆగ్రహించడం ఏమిటని కాషాయ తమ్ముళ్లు వాపోతున్నారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన పథకం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి టౌన్ : పాఠశాలల్లో విద్యార్థులకు ప్రధాన మంత్రి పోషణ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకం గురువారం నుంచి అమలుచేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ పథకంలో వండేందుకు ఉత్తమ రకం బియ్యం పంపిణీచేస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 2009 పాఠశాలలు, 171 ప్రభుత్వ హాస్టళ్లకు ఉత్తమ రకం బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సంక్షేమ హాస్టళ్లకు ఇప్పటికే 19,00,025 కిలోల బియ్యం అందజేశామన్నారు. బ్యాగ్‌లపై క్యూఆర్ కోడ్ ఉందని, స్కాన్ చేస్తే బియ్యం ఏ రైతు నుంచి కొనుగోలు చేసినదనే విషయం తెలుస్తుందని చెప్పారు.

జాతరలో రికార్డ్ డ్యాన్స్

- బాధ్యతలు మరిచిన ఎస్ఐ భక్తవత్సలం
- ఎస్పీ మందలింపుతో రికార్డు డ్యాన్స్‌పై కేసు నమోదు

రాయచోటి : బాధ్యత అంటే అంత అలుసా.. శాంతి భద్రతుల విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన పోలీస్ అధికారే ఇలా వ్యవహరిస్తే ఎలా అంటూ సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలంపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సీరియస్ అయ్యారు. శెటిపల్లె పెద్దబిడికి గ్రామంలో కొలువైన ముత్తు మారెమ్మ జాతరలో అసభ్యకర రికార్డు డ్యాన్స్ వేయడంతో ఎస్పీ సంబేపల్లె ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని డ్యాన్స్ చేస్తే వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలియదా అంటూ ఎస్పీ మందలించినట్లు తెలిసింది. మంగళవారం జాతరలో చాందినీబండ్ల వద్ద రికార్డు డ్యాన్స్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. అసభ్య, విచ్చలవిడితనంతో నృత్యం చేయడంతో కొంతమంది సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి అడ్డుకోవాల్సిన ఎస్ఐ జాతరకు వెళ్లకపోవడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వినికిడి. ఎస్పీ నివేదిక తెప్పించుకుని కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఇదే విషయం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలోనూ ఎస్పీ ప్రస్తావించినట్లు తెలిసింది. సంబేపల్లె ఎస్ఐ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేడు.

కారు వ్యవహారంలో వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : కారు కొనుగోలు వ్యవహారంలో ఓ పాఠశాలలో పనిచేస్తున్న గణేష్‌ను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గణేష్ రూరల్ పరిధిలోని ట్రస్టు ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం గుంటూరు జిల్లాలోని వినుకొండలో ఉంటున్న కోటేశ్వరరావు స్కార్పియో వాహనాన్ని అద్దె ప్రాతిపదికన తెచ్చుకున్నాడు. అద్దె డబ్బులను కారు కంతులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొన్ని రోజులు గణేష్ అద్దె చెల్లించాడు. తర్వాత అద్దె చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కొన్ని రోజుల క్రితం కోటేశ్వరరావు ప్రొద్దుటూరుకు వచ్చి పాఠశాల ఆవరణలో స్కార్పియో కారును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా గణేష్ అడ్డుకొని బలవంతంగా అతన్ని బయటకి తోసేశాడు. దీంతో కోటేశ్వరరావు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు.

టమాటా రైతులను ఆదుకునేందుకు చర్యలు

- ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై కార్యాచరణ
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్



అధికారులతో సమీక్షిస్తున్న ఛైర్మన్ లంకాదినకర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : టమాటా రైతులను ఆదుకునేందుకు, నష్టాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖ అధికారులు, వ్యవసాయరంగ నిపుణులతో కమిటీ వేసి అధ్యయనం చేస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పర్యటనలో భాగంగా బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ కార్యాలయంలో టమాటా రైతుల సమస్యలపై అధికారులతో ఆయన సమీక్షించారు. టమాటా ఉత్పత్తి, విస్తీర్ణం, దిగుబడులు, మార్కెటింగ్, ఎగుమతులు, ధరల ఒడిదుడుకులు, నష్టనివారణ చర్యలు, ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ..టమాటా రైతులు నష్టపోతున్న తరుణంలో వారికి లాభాలు వచ్చేందుకు ఏం చేయాలనే విషయమై చర్చలు జరిపామన్నారు. నెలరోజుల్లోపు నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించామని, రాగానే సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి టీజీ.భరత్‌ను కలిసి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత మార్కెట్‌యార్డు విస్తీర్ణం రైతుల అవసరాలకు సరిపోకపోవడం, ట్రాఫిక్‌సమస్య తలెత్తడంతో మార్కెట్‌ను తరలించి, భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ అధికారి సురేష్, ఉద్యానశాఖ అధికారిణి సుభాషిణి, లక్ష్మీ ప్రసన్న, ఏడీఏ శివశంకర్, ఏఓ నాగప్రసాద్, హెచ్ఓ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర వికసిత్ భారత్ వైపు పయనం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, బీజేపీ 11 ఏళ్ల పాలనలో ఆత్మనిర్భర వికసిత్ భారత్-2047 వైపు దేశం పయనిస్తోందని ఏపీ 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...2014లో ప్రధాని నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు 11వ స్థానంలో ఉన్నటువంటి దేశ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి జపాన్‌ను వెనుక్కు నెట్టి 4.20 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, భగవాన్, బండిఆనంద్, ఓసూరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.